# ప్రజా వ్యతిరేక పౌరసత్వచట్ట సవరణ చట్టానికి వ్యతిరేకంగా

# పెల్లుబికిన దేశవ్యాపిత నిరసన

**మోడీ షాల** నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాగానే మరింత దూకుడుగా తమ మతతత్వ ఎజెండా అమలుకు పూనుకొన్నది.వారి మతతత్వం వారు సేవచేస్తున్న దోపిడీ వర్గాల కోసమే.భూస్వామ్య అభివృద్ధినిరోధకత్వాన్ని, సామ్రాజ్యవాదంయొక్క ప్రజాపీడకత్వాన్ని అమలు చేయడానికి వారికి మతతత్వం అనేది ప్రజలను చీల్చి పక్కదారులు పట్టించే ఒక సాధనం, ఒక ముసుగు. నిరవధికమైన, తిరుగులేని నియంతృత్వ అధికారాన్ని బిజెపి చెలాయించాలనుకొంటున్నది. దీనికోసం ప్రజలలో మతోన్మాదాన్ని, జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలను తన మతతత్వ ఎజెండాలో భాగంగా అమలు చేసే క్రమం తీసుకొంది. దాని ప్రకారమే అస్సోంలో జాతీయ పౌరపట్టికను తయారుచేయడం దగ్గరనుంచి, పౌరసత్వ సవరణ చట్టం వరకూ, ఇప్పుడు జాతీయ జనాభా గణన వరకూ ఒక మతాన్ని ప్రత్యేకంగా లక్ష్యం చేసుకొంది.ముస్లిం మతాన్ని ఒక బూచిగా చూపించి మెజారిటీ హిందూ ఓటు బ్యాంకుతో నియంతృత్వానికి, ఫాసిస్టు తరహా పాలనకు పూర్తిగా రంగం సిద్ధం చేయదలచుకొంది. ముమ్మారు తలాక్ చట్టం మీదగానీ,బాబ్రీమసీదు పై సుప్రీంకోర్టు తీర్పు మీద గానీ ఎక్కాడా వారు ఆశించినట్లు గందరగోళం జరగలేదు. ముస్లిం ప్రజలనుంచి నిరసన వ్యక్తం అయితే దాన్ని భూతద్దంలో చూపించి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టా లనేది వారి అసలు వ్యూహం.ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ జనాభా గణన,తదితర చర్యలతో అలాంటి గందరగోళాన్ని బిజెపి పాలకులు ఆశించారు. కానీ వారి కుట్రలను తలకిందులు చేస్తూ యావత్ దేశంలోని విద్యార్థి, యువజనులూ, లౌకిక, ప్రజాస్వామికశక్తులూ, మైనారిటీ ప్రజానీకం ఒక్కతాటిపై కదలి,వీధుల్లోకి వచ్చి నిలబడ్డారు.

**నిరసన కేంద్రాలుగా యూనివర్సిటీలు**

డిసెంబరు 12 నాటికి బిజెపి పాలకులు పార్లమెంటు రెండు సభలలో పౌరసత్వ సవరణ బిల్లును ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మెజారిటితో ఆమోదించుకొన్నారు. వెంటనే రాష్ట్రపతి ఆమోదంతో బిల్లు చట్టమై, సి ఏ బి కాస్తా సిఏఏ అయింది. వెంటనే దేశవ్యాపితంగా నిరసనాందోళనలను ఊపందుకొన్నాయి. డిసెంబరు 15న ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా ముందు పోలీసువాహనాన్ని ఎవరో తగల పెడితే ఆ నెపం విద్యార్థులపై నెట్టి పోలీసులు యూనివర్సిటీలో ప్రవేశించి కనపడిన వారినల్లా విచక్షణారహితంగా కొట్టారు.లైబ్రరీలోకి ప్రవేశించి పుస్తకాలను ధ్వంసం చేస్తూ చదువు కొంటున్న వారిని పట్టుకొని తీవ్రంగా కొట్టారు (రామచంద్ర గుహ వ్యాసం 4/1/2020). ఈ అమానుషమైన నిర్బంధకాండ దేశవ్యాపితంగా అన్ని యునివర్సిటీల విద్యార్థులను కదలించింది. జె.ఎన్.యూ, జాదవ్ పూర్, హైదరాబాద్, చెన్నై, కలకత్తా, ముంబాయి తదితర అన్ని విశ్వ విద్యాలయాలు ఈ నిరసనలలో పాల్గొన్నాయి. విద్యార్థులతో ఉపాధ్యాయులు జత కలిసారు. ఉన్నత విద్యాలయాలు భిన్న ఆలోచనల కేంద్రాలుగా నిలవకూడదన్న బి జె పి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా కూడా ఇవి వ్యక్తమైనాయి. వీధినాటకాల నుంచీ, పోస్టర్లు, ప్రదర్శనలు, మానవహారాల వరకూ, ఢిల్లిలో అయితే పార్లమెంటు, రాష్ట్రపతి భవన్ వరకూ ప్రదర్శనలు, ఇలా అన్ని రకాల నిరసన రూపాలకు యూనివర్సిటీలు వేదికలైనాయి. డిసెంబరు 15న నుండి నేటి వరకూ జామియా మిలియా సిఏఏకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూనే ఉంది. ముఖ్యంగా ఢిల్లీలోని షహీన్ బాగ్ మహిళల నిరసనకు ఒక గొప్ప కేంద్రంగా మారింది. డిసెంబర్ 15 జామియా మిలియా ఇస్లామియాపై దాడి అనంతరం 6–7 గురితో మొదలైన బైఠాయింపు నిరసన కొద్ది రోజులకే వేలాది మంది మహిళలతో వృద్ధులు, చిన్న పిల్లలనే తేడా లేకుండా గడ్డకట్టించే చలిలో గత 35రోజులుగా సాగుతూనే ఉంది.

జామియా మిలియా వలెనే ఉత్తర ప్రదేశ్ లోని ఆలిఘర్ ముస్లిం యునివర్సిటీ కూడా పోలీసుల తీవ్రమైనదాడికి గురైంది. డిసెంబర్ 15 రాత్రి ఆలిఘర్ ముస్లిం యునివర్సిటీ పై రాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్ ఏ ఎఫ్ ) విరుచుకొని పడింది. రబ్బరు బుల్లెట్లు, పిల్లెట్లు, టియర్ గ్యాసు గోళాలు, స్టెన్ గ్రైనేడ్లుతో ఒక విదేశీ సైన్యంపై యుద్ధానికి వెళ్ళినట్లు వెళ్ళారు. విచక్షణా రహితంగా జరిగిన ఈ దాడిలో 60కి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. అనేక విద్యార్థుల వాహనాలు దగ్ధం అయినాయి. 22 మంది విద్యార్థుల ఆచూకి లేదు. ఈ బీభత్సం తర్వాత 21 మంది గుర్తించిన విద్యార్థులను, ఇంకో 500మంది గుర్తించాల్సిన విద్యార్థులపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయింది.

2019 డిసెంబర్ 19న సి.ఏ.ఏ.కు నిరసనగా ఇచ్చిన దేశవ్యాపిత పిలుపు గొప్ప స్పందనను తెచ్చింది. దేశం మొత్తంగా లక్షాలాది మంది వీధులలోకి వచ్చారు. అలా వచ్చిన వారంతా సాధారణ ప్రజలు. ఇంతకు ముందెన్నడూ వీధుల్లోకి రాని మహిళలు, మాములు మనుషులు అందోళనలోకి వచ్చారు.

**అణచివేతలో ఉత్తరప్రదేశ్ తీరు మహా ఘోరం**

డిసెంబరు 16 నుంచే ఉత్తరప్రదేశ్‌లోని 21 జిల్లాల్లో ఇంటర్నెట్ సర్వీసులు నిలిపి వేయబడ్డాయి. డిసెంబరు 19న శాంతియుత నిరసన పిలుపులో ఎవరూ పాల్గొనరాదని ప్రభుత్వం 144 సెక్షన్ పేరుతో దాదాపు కర్ఫ్యూ అమలు చేసింది. 3000 మందిని బైండ్ ఓవర్ కేసులు కింద సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించింది. అనేక మంది వామపక్ష, ప్రజాతంత్రవాదులను గృహ నిర్బంధంలో ఉంచింది. ఈ సందర్భంగా 20 మంది తుపాకి తూటాలకు మరణించారు.చాలా చోట్ల పోలీసులే రివాల్వర్లతో నేరుగా గురిపెట్టి శాంతియుతంగా ఆందోళన సాగిస్తున్న వారిపై కాల్పులు జరిపారు. శాంతియుత ఆందోళనలో కొందరు గుండాలను ప్రవేశపెట్టి వారిచేత వాహనాలను తగులపెట్టించి వెంటనే కాల్పులు జరపడం వంటివి సాగించారు. వెంటనే ముఖ్యమంత్రి ఈ నిరసనపై మాట్లాడుతూ ప్రతీకారం తీర్చు కొంటామని ప్రకటించాడు.అలాగే జరిగిందని పై పరిణామాలు తెలియచేస్తున్నాయి. మీరట్, కాన్పూర్, ముజఫర్ నగర్, లక్నో తదితర అన్ని ప్రాంతాలు రక్తమోడాయి.

**ముస్లిం పెద్దలను లక్ష్యంగా చేసుకొని సాగించిన క్రూరమైన దాడులు**

ముజఫర్‌నగర్‌లోని సదత్ మదర్సాకు 72 సంవత్సరాల మౌలానా అసద్ రజా హుస్సాని నిర్వాహకులు. ఈయనకు గత సంవత్సరమే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదగా అరబిక్ భాషలో విశేష ప్రతిభ కలిగిఉన్నందుకు మహర్షి బాదరాయన్ వ్యాస సమ్మాన్ అవార్డ్ ను తీసుకొన్నారు.ఈయన నడిపే మదరసాలో విద్యార్థులందరూ 15 నుండి 22 సంవత్సరాల వారే, వారిలో కొందరు అనాథలు కూడా. డిసెంబరు 20న ఆయన మదరసాపై దాడి జరిగింది.పోలీసులు కొందరు ఆందోళనాకారులు ఈ మదరసా లో ఉన్నారనే అనుమానంతో వచ్చినట్లు చెప్పి కనిపించిన వారినల్లా కొట్టారు. అనేకమందిని హుస్సానితో సహా నిర్బంధించి తీసుకొని వెళ్ళారు.ఆయన బట్టలు విప్పి ఘోరంగా చిత్రహింసలు పెట్టారు. కేసులు పెట్టబోమన్న షరతుమీద రక్తంతో తడిసి ముద్దైన ఆయనను ఆయన అనుచరులకు అప్పగించారు. మైనారిటీ మతాలకు చెందిన గౌరవనీయులైన వారిని ఘోరంగా అవమా నించడం ఈ నిర్బంధ విధానంలో ఒక అంశం. ఈ సందర్భంగా అక్కడి కొందరు విద్యార్థుల చేతులు, కాళ్ళు విరిగి పోయేలా చిత్రహింసలు పెట్టారు. ఇదేవిధంగా ముజఫర్‌నగర్‌లోని మరో అరబిక్ స్కాలర్ మహమ్మద్ అసద్‌నూ తీసుకొని పోయి కొట్టారు. పరిస్థితి ఇక్కడితో ఆగలేదు. అల్లర్లలో జరిగిన ఆస్తి నష్టానికి బాధ్యులనుంచి నష్టపరిహారం వసూలు చేస్తామని యు.పి ముఖ్యమంత్రి ప్రకటించారు. డిసెంబర్ 24న 28 మందికి 14.86 లక్షలు చెల్లించాలని ఆవిధంగా నోటీసులు వచ్చాయి. అనేక ప్రాంతాలలో ముస్లింల వ్యాపారసంస్థలు, ఇళ్ళు ధ్వసం చేయ బడటమో, లూటి చేయడమో జరిగింది. వేల సంఖ్యలో రాజద్రోహ నేరం కింద కేసులు బనాయించారు. (ఎన్.ఎ.పి.ఎం. నివేదిక)

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఘోర ఘటనలపై న్యూయార్క్ టైమ్స్, టెలిగ్రాఫ్‌లు ప్రచురించిన మానవహక్కుల ఉల్లంఘనల నివేదికలపై అలహాబాద్ హైకోర్టు రెండు సువామోటో కేసులు నమోదు చేసింది.

**ఈశాన్య భారతంలో సి.ఏ.ఏ.కి నిరసన**

ఈశాన్య భారతంలోని అన్ని రాష్ట్రాలలో సీ.ఏ.ఏ. వ్యతిరేక ఆందోళనలు చెలరేగాయి. ముఖ్యంగా అస్సోం అగ్నిగుండంగా మారింది. జామియా మిలియా ఇస్లామీయ ఘటనలకు తీసిపోని విధంగా గువహతి యునివర్సిటీ విద్యార్థులపై నిర్బంధం అమలు జరిగింది. డిసెంబర్ 15 నాటి విద్యార్ధి అందోళనలలో నలుగురు విద్యార్థులు పోలీసు కాల్పులలో మరణించారు. 175 మంది అరెస్టు అయ్యారు. 1400 మందికి పైగా డిటెయిన్ చేయబడ్డారు. నాటి నుంచి లక్షలాది మంది వీధులలోకి వచ్చారు.ఆందోళనల తీవ్రత ఎంతగా వుందంటే 2020 జనవరి 10న జరుగుతున్న అఖిల భారత యువజన క్రీడోత్సవాల ప్రారంభానికి రావాల్సిన ప్రధాని తన పర్యటనను రద్దు చేసుకొన్నారు. ఈశాన్య భారతంలోని ఆదివాసీల ప్రత్యేక హక్కుల సమస్యలో భాగంగా అస్సోం లోని ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది.అది ఏమంటే ఆస్సోంలో 1985 కు ముందు జరిగిన అనేక హింసాయుత ఆందోళనల క్రమంలో 1985లో ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు 1971ను గడువు(కట్ ఆఫ్) సంవత్సరంగా నిర్ధారించారు. దాని అమలే సమస్యాత్మకంగా మారింది. ప్రస్తుత సి.ఏ.ఏ. 2014ను అలాంటి గడువు సంవత్సరంగా చెపుతున్నది. ఇది అక్కడి వారిని ఎక్కువ ఆందోళనకి గురిచేస్తున్నది.దీనితో ఈశాన్య భారతంలో ఆందోళనలు కొనసాగుతూనే వున్నాయి.

ఇంతేగాక దేశవ్యాపితంగా అన్ని ప్రాంతాలు సి.ఏ.ఏ. వ్యతిరేక ఆందోళనలో మునిగి పోయాయి. బొంబాయి ఇండియా గేట్ నిరంతర నిరసనలకు వేదికగా మారింది.బాలివుడ్ తారలు ఈ అందోళనలకు మద్దతు పలకడం, ముఖ్యంగా ఢిల్లి జవహర్లాల్ నెహ్రు విశ్వ విద్యాలయంపై దాడిని ఖండించడం మీడియా సంచలనంగా మారింది.

హైదరాబాద్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 48 సంఘాల పిలుపుతో జనవరి 4న ఇందిరాపార్క్ వద్ద దాదాపు లక్ష మందితో గొప్ప నిరసన ప్రదర్శన జరిగింది.

దేశ వ్యాపితంగా సాగుతున్న ఈ నిరసనలు అనేక ప్రాధాన్యతాంశాలను ముందుకు తెచ్చాయి. ఈ ఆందోళనల సందర్భంగా బిజె.పి నాయకులు సి.ఏ.ఏ.ను వ్యతిరేకించేవారంతా పాకిస్తాన్ వెళ్ళిపోవాలనే దుష్ప్రచారాన్ని ఈ నిరసనకారులు జాతీయ జెండాలతో, హిందూ ముస్లిం భాయి భాయి నినాదాలతో ఎదుర్కొన్నారు. పాలకులు ఎంత విషంపోయాలని ప్రయత్నిస్తున్నా తరతరాలుగా ప్రజలమధ్య ఉన్న మౌలిక ఐక్యతను కాపాడుకోవాలనే పట్టుదల ఈ ఆందోళనలలో వ్యక్తంఅయిన ఒక ముఖ్యాంశం.

జనవరి 8న జరిగిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత బంద్‌లు కార్మిక, రైతు, కూలీల సమస్యలతో పాటు సి.ఏ.ఏ రద్దును, పాలకుల మతతత్వాన్ని నిరసించే అంశాలను కలిగివుంది. ముట్టడిలో వున్న కాశ్మీర్‌ను మినహాయిస్తే(అక్కడి విషయాలు ఇవతలకి, ఇవతలి విషయాలు అక్కడికి సరిగా తెలియడం లేదు కనుక) మొత్తం దేశం ఆ ఒక్క రోజు జరిగిన నిరసనలో లక్షలాదిమంది పాల్గొన్నారు.

జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులపై విరిగిన లాఠీకి దేశ ప్రజలిచ్చిన సమాధానమే ఈ నిరసనాందోళనల పరంపర.

ఇక్కడ ఎదురౌతున్న ఒక ప్రశ్న ఏమంటే బిజెపి ప్రభుత్వంలోని రాజకీయ నాయకత్వం ఎందుకింత నిర్బంధ విధానానికి తెగబడింది? ఈ నిరసనలన్ని శాంతియుతంగా సాగినవే.ఈ నిరసనలతోనే బిజెపి ప్రభుత్వం పడిపోదని కూడా వారికీ తెలుసు. అయినా వారు ఈ ఆందోళనలను చూసి ఎందుకు కలవర పడుతున్నారు?.

1. పార్లమెంట్లు, ప్రభుత్వమూ, కోర్టులు, మీడియా ఇలా అన్ని వ్యవస్థలను గుప్పెట పెట్టుకొన్నాక వారికి ఎదురైన పెద్ద ప్రమాదం ఏమంటే నిరసన అన్నది వీధుల్లోకి వచ్చింది. ఈ వీధులు ఇప్పుడు సరైన నినాదాలను ప్రతిధ్వనిస్తున్నాయి. కదల బారుతున్న వీధులు పాలకులకు భయం కొలుపుతున్న అంశం. రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వీధులలో జరుగుతున్న పరిణామాలు మదుపరుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాడు.

2. బిజెపి మతతత్వ ఎజెండాను సి.ఏ.ఏ ద్వారా ముందుకు తీసుకొని పోవడానికి కేవలం ముస్లింలేగాక అన్ని తరగతుల ప్రజానీకం సమైక్యంగా కదలటం ఒక ఎదురుదెబ్బగా మారింది. ఈ ఆందోళనచేసే వారంతా ముస్లింలే అని వారి మీడియా ఎంత ప్రచారం చేసినా నిరసనలలో పాల్గొంటున్న లౌకిక, ప్రజాస్వామిక ఉదారభావాల శక్తులంతా కదలడం బిజెపి పాలకులకు చెంపదెబ్బలా పనిచేసింది. క్లాస్ స్ట్రగుల్ తన సంపాదకీయంలో రాసినట్లు "విద్యార్థులూ, యువతీ యువకులు ఈ నిరసనలలో కీలకమైన పాత్ర పోషించారు. మొత్తం ప్రజల నిరసనాందోళనలలో వారొక శక్తివంతమైన, స్పష్టమైన గొంతుకగా నిలిచారు. చలనశీలత, సమరశీలత, నిజాయితీ, ధిక్కారతత్వం వంటి వారి సహజగుణాలన్నీ ఈ నిరసనలలో బలంగా అభివ్యక్తం అయినాయి".

ఇలాంటి అనేక సవాళ్ళనూ, ఒక ఆశాజనకమైన భవిష్యత్తును వాగ్దానం చేస్తూ సి.ఎ.ఎ. వ్యతిరేక ఆందోళనల క్రమంలో 2019 సెలవు తీసుకొంది.

ooo